క్లుప్తంగా

అధ్యాపకురాలికి సత్కారం



బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్మెంట్‌లో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పుట్టా బృందావని అనంతపురం జేఎన్‌టీయూ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందింది. వర్సిటీ ప్రొఫెసర్ దూపకుంట్ల విష్ణువర్దన్ పర్యవేక్షణలో 'ఎలక్ట్రో ఎన్సెపలోగ్రఫీ' (ఈఈజీ) తరంగాలను సమర్థవంతంగా వినియోగించే, విశ్లేషించే విధానంపై పరిశోధనలు సాగించి పత్రాలను సమర్పించడంతో వర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను ఆర్ఎస్ఆర్ ప్రిన్సిపల్ పీవీఎన్‌రెడ్డి, సహచర అధ్యాపకులు శనివారం సత్కరించి అభినందించారు. కళాశాల ఏఓ ఆర్వీ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సునీల్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

వరికుంటపాడు : మండలంలోని అశోక్‌నగర్‌లో శనివారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీహెచ్ఓ రాజశేఖర్‌రాజు పరిశీలించారు. టీకాల రిజిష్టర్లను తనిఖీ చేసి ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు.

నేడు సీపీఎం ప్రాంతీయ సభ

వరికుంటపాడు: ఉదయగిరిలోని సీపీఎం కార్యాలయంలో ప్రాంతీయ మహాసభను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకుడు కంచర్ల వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. జిల్లా నాయకులు హాజరై ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక, తదితర అంశాలపై చర్చిస్తారని చెప్పారు. మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బిల్లులు లేని ఫోన్లు కొనుగోలు చేయొద్దు

బిట్రగుంట: ప్రజలు తక్కువ ధరకు లభించే సెకండ్ హ్యాండ్, బిల్లులు లేని సెల్‌ఫోన్లను కొనుగోలు చేసి ఇబ్బందుల్లో పడొద్దని బిట్రగుంట ఎస్సై భోజ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనం చేసిన సెల్‌ఫోన్లను తక్కువ ధరకు విక్రయించే ముఠాల కారణంగా అమాయకులు ఇబ్బందుల్లో పడుతున్నారన్నారు. చోరీకి గురైన సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అందించే సాంకేతిక వ్యవస్థ పోలీసుల వద్ద ఉందని, తక్కువ ధరకు వస్తున్నాయనే ఆశతో ఫోన్లు కొనుగోలు చేస్తే ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పోలీసు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్కువ ధరకే సెల్‌ఫోన్లు అంటూ వచ్చే ప్రకటనల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసే ముందు సరైన బిల్లు, ఛార్జర్, బాక్స్ సరిగా ఉన్నాయో..లేవో నిర్ధారించుకున్న తరువాతే కొనుగోలు చేయాలని సూచించారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ



కావలి: అల్లూరు: అల్లూరు, కావలిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరు, కావలిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. అల్లూరులోని కాటంరెడ్డి నివాసంలో భారీ కేక్‌ను కట్ చేసి పంచారు. పేదలకు అన్నదాన చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాలకృష్ణంరాజు, దండా కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకయ్య, దీలీప్, వెంకటకృష్ణారెడ్డి, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మర్రిపాడు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తొలుత మండలాధికారులు శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టనున్న పనులను వివరించారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై తూతూ మంత్రంగా చర్చించి సమావేశాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఏపిలగుంట ఎంపీటీసీ నాయుడు హజరత్‌రెడ్డి గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించలేదని, అలాంటప్పుడు సమావేశాలు నిర్వహణ ఎందుకని ప్రశ్నించారు.

14న సీపీఎం ధర్నా

జలదంకి: ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి రావి మాల్యాద్రి తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెను భారం మోపుతున్నాయన్నారు. ప్రజాసమస్యలపై ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేపడుతున్న ధర్నాలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ఆంతోనిబాబు, గద్దం మాల్యాద్రి పాల్గొన్నారు.

పల్లెరోడ్లు ఛిద్రం

అసలే ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు.. ఆపై వర్షాకాలం..ఇంకేముంది పల్లెరోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. పెద్దపెద్ద గుంతలతో బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. మరోవైపు పదుల సంఖ్యలో గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై ప్రత్యేక కథనం.



గుంతలతో నిండిన వింజమూరు-చాకలకొండ రోడ్డు

ఉదయగిరి: ప్రభుత్వాలు, పాలకులు మారినా ఉదయగిరి నియోజకవర్గంలోని పల్లెలను కలిపే రోడ్ల స్థితిగతులు మాత్రం మారడం లేదు. నియోజకవర్గంలో ఎనిమిది మండలాలు ఉండగా, వాటి పరిధిలో 143 పంచాయతీలు, 300 వరకు మజారా గ్రామాలు ఉన్నాయి. అనేక మారుమూల పల్లెలకు నేటికి సక్రమంగా రోడ్లు లేవు. ఉన్న రోడ్లు కూడా ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారాయి. తారులేచిపోయి కంకర తేలి భారీ గుంతలో నిండాయి. ఈ రోడ్లపై చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉండి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. రహదార్లు బాగా లేని అనేక పల్లెలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆటోలు, బైక్‌లపై రాకపోకలు సాగుతున్నాయి. గుంతలతో నిండిన రోడ్లపై ప్రయాణం చేసే క్రమంలో ప్రయాణికులు నరకాన్ని చవిచూస్తున్నారు.

• వింజమూరు నుంచి చాకలకొండ మీదుగా పామూరు వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో ఇరవై గ్రామాల ప్రజలు నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. ఇటీవల వింజమూరు-రాగిపాడు మధ్యలో మరమ్మతుల పేరిట ఉన్న రోడ్డును కూడా తొలగించడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

• బండగానిపల్లి-ఉదయగిరి మార్గంలో ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం సుమారు 20 గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. మూడు కి.మీ దూరం అటవీ అనుమతులు రాక రోడ్డు నిర్మాణం వీలు కాలేదు. ఏ ప్రభుత్వం వచ్చినా వారి బాధలు మాత్రం తీరడం లేదు.

•వరికుంటపాడు మండలంలోని జంగంరెడ్డిపల్లె, ఎన్‌బీకాలనీ, అశోక్‌నగర్, కాకొల్లువారిపల్లి, హుస్సేన్‌నగర్, కృపావారిపల్లె, కొండ్రాజుపల్లె, చెన్నంపల్లె, దుత్తలూరు మండలం బండకిందపల్లి, తిమ్మాపురం, వెంగనపాళెం, పాపంపల్లి, జలదంకి మండలంలో రామరప్పపాడు, అన్నవరం, కమ్మవారిపాళెం, ఉదయగిరి మండలంలో గుడినరవ, జెట్టివారిపల్లి, ఆర్లపడియ,కొండాపురం మండలం రామానుజపురం, కుంకువారిపాళెం, తూర్పుపాళెం, వింజమూరు మండలం రామదేవులపాడు, వెంగనపాళెం, వన్నెవారిపాళెం, నల్లారెడ్డిపల్లి, తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రచారానికే పరిమితం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రోడ్లను అద్దాలుగా తీర్చిదిద్దుతామని నేతలు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా గ్రామీణ రహదారులపై తట్టెడు మట్టి కూడా వేయడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా ఛిద్రమైనా పట్టించుకోకపోవడంతో కనీసం ద్విచక్రవాహనంపై కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో..



కాంట్రాక్టర్ తవ్వి వదిలేయడంతో బురదమయంగా మారిన రేణమాలరోడ్డు

కొండాపురం: మండలంలోని నాలుగు గ్రామాలకు లింక్‌రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ద్వారా రూ.15 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో కొమ్మి-సత్యవోలు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గానుగపెంట మీదుగా కొండాపురం-కలిగిరి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు, వెలిగండ్ల పంచాయతీ పరిధిలోని చర్చి వద్ద నుంచి మర్రిగుంట గ్రామం వరకు, కొండాపురం- లింగసముద్రం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రేణమాల పాటూరు వరకు, అలాగే తూర్పుపాళెం గ్రామం వరకు రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. టెండర్ల ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మర్రిగుంట, గానుగపెంట రోడ్లను పూర్తి చేశాడు. మిగిలిన రోడ్లను పూర్తి చేయలేదు. ఆరు నెలల క్రితం రేణమాల, తూర్పుపాళెం రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాడు. గతంలో ఉన్న మెటల్ రోడ్లను జేసీబీతో తవ్వి కల్వర్టులను పూర్తి చేశాడు. ఆ తర్వాత రోడ్ల నిర్మాణ పనులు చేపట్టకుండా వదిలేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారడంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

అధ్వానంగా రోడ్డు



తిమ్మారెడ్డిపల్లె నుంచి చాకలకొండ మీదుగా వింజమూరు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. 35 కి.మీ దూరానికి కనీసం 90 నిమిషాలు ప్రయాణ సమయం పడుతోంది. భారీ గుంతలతో నిండిన రోడ్డుపై బైక్‌పై పోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం.అధికారులు స్పందించి కనీసం గుంతలైనా పూడ్చాలి.

–బీ వెంకటరెడ్డి,నారసింహాపురం

ఘాట్‌రోడ్డుకు మోక్షం ఎన్నడో?



ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. మూడు కి.మీ దూరం అటవీ అనుమతులు లభించక రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– కాకు వెంకటయ్య, సీపీఎం నాయకుడు

నరకం చూస్తున్నాం

ఆరు నెలల క్రితం రేణమాల రోడ్డు పనులను కాంట్రాక్టర్ ప్రారంభించాడు. రోడ్డు తవ్వి కల్వర్టుల నిర్మాణం చేపట్టి వదిలేశాడు. వర్షం పడితే రోడ్డుపై నీరు నిల్వ ఉండి బురదమయంగా మారుతుండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీతో రోడ్డు పనులకు సంబంధం లేకపోయిన ప్రజలు నాపై గొడవకు దిగుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– షేక్ మహబూబి, సర్పంచ్, రేణమాల

దివ్యాంగుల సంక్షేమానికి సక్షమ్ కృషి



సంగం: దివ్యాంగుల సంక్షేమానికి సక్షమ్ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి రంగయ్య పేర్కొన్నారు. సంగంలో సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్షమ్ సంస్థ ద్వారా దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఉపకరణాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. నెల్లూరులోని జయభారత్ ఆస్పత్రిలోని దివ్యాంగ సేవా కేంద్రంలో దివ్యాంగులకు అవసరమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగుల సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా ప్రతినిధులు బాలసుబ్రహ్మణ్యం, నాగమణి, వినయ్‌కుమార్‌రెడ్డి, రాములమ్మ, రమణయ్య, స్వరూప, సంగం మండల ప్రముఖ్ అంజయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఉదయగిరి: మండలంలోని సర్వారాబాదు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నేలటూరుకు చెందిన శ్రీను అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. సీతారామపురం నుంచి ఉదయగిరి వస్తున్న టెంపో వాహనం సర్వారాబాదు సమీపంలో గేదెను ఢీకొంది. దీంతో గేదె మృతి చెందింది. అదే మార్గంలో ఉదయగిరి నుంచి నేలటూరుకు బైక్‌పై వెళుతున్న శ్రీను గేదెను గమనించక ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో కోటిసోమవారం పూజలు

కావలి: కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రం ఉన్న రోజును కోటిసోమవారంగా జరుపుకోవడం ఆనవాయితీ. శ్రవణ నక్షత్రం గడియలు శనివారం ఉదయం వరకు ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో పట్టణంలోని పాతూరు శివాలయానికి తరలివచ్చారు. ఆదిదంపతులను దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించారు.

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన చేశారు. పంటవీధి రామాలయంలోని శివాలయంలో స్వామివారికి అర్చకులు నాగరాజశర్మ ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీదేవికి కుంకుమార్చన చేశారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



కావలి శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చేజర్ల: కోటితీర్థం క్షేత్రంలోని కోటేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



ఆత్మకూరు: కార్తీక మాసం కోటి సోమవారాన్ని పురస్కరించుకుని ఆత్మకూరులోని శివాలయ ప్రాంగణంలో అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక, అయ్యప్ప, సుబ్రహ్మణ్యస్వాముల విగ్రహాలను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అయ్యప్పస్వామికి అష్టోత్తర పూజలు జరిపారు. సామూహికంగా భజనలు చేశారు. అనంతరం భిక్ష పంపిణీ చేశారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

అల్లూరు/ వరికుంటపాడు: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం 40 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే వరికుంటపాడు పీహెచ్‌సీలో డాక్టర్ ఆయేషా 12 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.

వ్యక్తిపై కేసు నమోదు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి అనే వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పైడేరు కట్టలు ధ్వంసం

అల్లూరు: మండలంలోని పైడేరు కట్టలను మట్టి మాఫియా ధ్వంసం చేస్తోంది. పైడేరుకు ఇరువైపులా ఉన్న కట్టల మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పలుచోట్ల కట్టలు బలహీనమయ్యాయి. పైడేరును ఆనుకుని బీరంగుంట, నార్తుఆములూరు గ్రామాలు ఉన్నాయి. భారీ వర్షాలు పడి పైడేరు పొంగితే పొలాలు, గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీరంగుంటలో పైడేరు వాగుకట్టపై ఉన్న శ్మశానాన్ని కూడా మట్టి మాఫియా వదల్లేదు. పైడేరు వాగు కట్టపై హిందువులు ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటికను ఏర్పాటు చేసుకుని కర్మకాండలు జరుపుకొంటుండగా దాన్ని కూడా వదలకుండా మట్టి మాఫియా తవ్వేసి మట్టిని తరలించిందని మండల వైఎస్ఎంపీపీ గుమ్మడి సురేంద్ర తెలిపారు. శ్మశానాన్ని కూడా తవ్వేయడం బాధాకరమని , రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి మట్టిమాఫియాపై చర్యలు తీసుకోవడంతో పాటు శ్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరారు.



మట్టిమాఫియా తవ్వేయడంతో బలహీనపడిన పైడేరు కట్ట

కఠిన చర్యలు తప్పవు

పైడేరు కట్టను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగింది. పైడేరు కట్టలు బలహీనంగా ఉండడం గమనించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కట్టలను పటిష్ట పరిచేందుకు టెండర్లను పిలవడం జరిగింది. వర్క్ ఆర్డర్ రాగానే పనులను ప్రారంభిస్తాం. పైడేరు నిత్య పర్యవేక్షణకు ఇరిగేషన్ సిబ్బందిని పెట్టాం. ఇకపై ఎవరైనా పైడేరు నుంచి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరాజు ,డ్రైయిన్స్ ఏఈ

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ఆత్మకూరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించామని తెలిపారు. అందులో భాగంగా గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన 25 మంది విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం ఎస్సై షేక్ జిలానీతో కలిసి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ కామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సీఐ, ఎస్సైలు

విద్యుత్ చార్జీల పెంపు దారుణం

బిట్రగుంట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూఅప్ చార్జీల పేరుతో కరెంటు చార్జీలు పెంచడం, స్మార్ట్ మీటర్ల పేరుతో దోపిడీకి తెరతీయడం దారుణమని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ప్రజాసమస్యలపై సీపీఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమాన్ని బోగోలులో శనివారం నిర్వహించారు. వ్యవసాయకార్మిక సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ మాల్యాద్రి, సీపీఎం సీనియర్ నాయకులు టీ వెంకయ్య, పోతల రమేష్, పోట్లూరు శీనయ్య, తదితరులు ఇంటింటికి తిరిగి పేదప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతున్న భారాన్ని వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూఅప్ చార్జీల పేరుతో కరెంటు చార్జీలను పెంచడం ద్వారా ఏకంగా రూ.6400 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. వచ్చే ఏడాది మరో రూ.11వేల కోట్ల మేర భారాన్ని మోపేందుకు సిద్ధమవుతోందన్నారు. ప్రజల ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని కొల్లగొట్టేలా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా పెంచడం సరికాదన్నారు. మద్య నియంత్రణకు కృషి చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా విచ్చలవిడిగా షాపులు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంతో పాటు బెల్టుషాపుల ఏర్పాటుకు గేట్లు బార్లా తెరిచిందన్నారు. దీంతో కుటుంబాలకు కుటుంబాలే వీధిన పడే పరిస్థితి నెలకొందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు చుక్కలు చూపిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరగడం, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరెంట్ చార్జీల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే పోరుబాట తప్పదని హెచ్చరించారు.



బిట్రగుంట: బోగోలులో కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

నిర్లక్ష్యపు తుప్పు



వింజమూరు, వరికుంటపాడు హౌసింగ్ కార్యాలయాల్లో తుప్పు పట్టిన ఐరన్

ఉదయగిరి: గత ప్రభుత్వం జగనన్న కాలనీ లేఅవుట్లలో పక్కాగృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు చువ్వను మంజూరు చేసింది. లబ్ధిదారులు త్వరతిగతిన ఇళ్లు నిర్మించుకునేందుకు ఈ వెసులుబాటు కల్పించింది. వింజమూరు, వరికుంటపాడు మండలాలకు ఎన్నికల నోటిఫికేషన్ సమయంలో చువ్వ వచ్చింది. దాన్ని నోటిఫికేషన్ పేరుతో అధికారులు లబ్ధిదారులకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు చువ్వను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. వింజమూరు, వరికుంటపాడు హౌసింగ్ కార్యాలయాల బయట చువ్వను నిర్లక్ష్యంగా పడేయడంతో వర్షానికి తడిచి తుప్పుపట్టి పోతుంది. మరికొన్ని నెలలు గడిస్తే పూర్తిగా తప్పుపట్టి చువ్వ పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. మరోవైపు ఇటీవల కాలంలో కొంతమేర చువ్వ అపహరణకు సైతం గురైనట్లుగా కూడా చర్చసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి లబ్ధిదారులకు చువ్వను అందిస్తే ప్రజాధనం వృథావకుండా ఉంటుంది.ఈ విషయమై కావలి హౌసింగ్ ఈఈ మాధవరావును వివరణ కోరగా జగనన్న పక్కాగృహ నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, త్వరలోనే చువ్వను లబ్ధిదారులకు అందజేసి శ్లాబ్‌లు పూర్తి చేయిస్తామన్నారు. చువ్వ అపహరణకు గురైతే సంబంధిత అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పచ్చని పల్లెలపై మద్యం మహమ్మారి

- విచ్చలవిడిగా బెల్టు దుకాణాల ఏర్పాటు
- ఎమ్మార్పీపైన అదనంగా రూ.50 వసూలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

బిట్రగుంట: గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తా. ఎమ్మార్పీకి మించి విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, నాయకులు జోక్యం చేసుకోవద్దు.. సమీక్ష సమావేశాల్లో సీఎం చంద్రబాబునాయుడు చెబుతున్న మాటలు.. వాస్తవానికి ఊరూరా బెల్టు షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. వేలాది రూపాయలు డిపాజిట్లు కట్టి బెల్టుదుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ఒక్కో మద్యం సీసాపై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల లూజు మద్యం విక్రయిస్తూ నీళ్లతో కల్తీ చేస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలను కూడా అటు నాయకులు, ఇటు అధికారులు లెక్కచేయడం లేదు. బోగోలు మండలంలో అధికారికంగా నాలుగు మద్యం దుకాణాలు ఉండగా, వీటికి అనుబంధంగా 50కి పైగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన బెల్టు దుకాణాలకు కూడా రేట్లు నిర్ణయించి వేలాది రూపాయలు డిపాజిట్ల రూపంలో దండుకున్నారు. ఒక్కో బెల్టుషాపునకు జనాభాను, అమ్మకాలను బట్టి రూ.30వేల నుంచి రూ.1.7లక్షల వరకు డిపాజిట్ల రూపంలో సేకరించి బెల్టుదుకాణాలు కేటాయించారు. ఏనుగులబావిలో ఏర్పాటు చేసిన బెల్టు దుకాణానికి అత్యధికంగా రూ.1.7లక్షలు, సాంబశివపురంలో రూ.50 వేలు వంతున డిపాజిట్లు వసూలు చేసినట్లు తెలిసింది. మిగిలిన చోట్ల ఒక్కో బెల్టుషాపునకు రూ.30వేలు, రూ.20వేల వంతున వసూలు చేసినట్లు సమాచారం. బిట్రగుంట పంచాయతీలో అత్యధికంగా పది వరకు బెల్టుదుకాణాలు ఉండగా, తాళ్లూరు పంచాయతీలో ఏడు, ముంగమూరులో నాలుగు, ఎస్వీపాళెంలో నాలుగు, విశ్వనాథరావుపేటలో మూడు, బోగోలు పంచాయతీ కప్పరాళ్ళతిప్పలో నాలుగు, సుందరగిరివారికండ్రిగలో మూడు, జక్కేపల్లిగూడూరులో మూడు, ఉమామహేశ్వరపురంలో మూడు, కోవూరుపల్లిలో రెండు, ఏనుగులబావిలో ఒకటి, కోళ్లదిన్నెలో ఒకటి, సాంబశివపురంలో ఒకటి వంతున బెల్టు దుకాణాలు నడుస్తున్నాయని తెలిసింది. వీటితో పాటు తీరంలోనూ విచ్చలవిడిగా బెల్టుదుకాణాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

అధిక ధరలు..ఆపై కల్తీ

బెల్టుదుకాణాల కోసం వేలాదిరూపాయలు డిపాజిట్ల రూపంలో చెల్లించిన నిర్వాహకులు ఒక్కో మద్యం సీసాపై అదనంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా లూజు మద్యం విక్రయించే క్రమంలో నీళ్లతో కల్తీకి కూడా పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం సీసాల సీల్‌ను సూది వంటి పరికరంతో తొలగించి నీళ్లు కలుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా మద్యం ఊసే లేకుండా ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో మళ్లీ మద్యం మహమ్మారి వ్యాపించడంతో మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మగవాళ్లు సంపాదించిందంతా సాయంత్రానికి మందుకే తగలేస్తున్నారని వాపోతున్నారు. మద్యం మత్తులో పనులకు కూడా వెళ్లడం లేదని, ఇళ్లలో గొడవలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న దుకాణాల్లో మాత్రమే మద్యం లభిస్తుండడం, బెల్టుషాపుల ఊసే లేకపోవడంతో మద్యానికి దూరంగా ఉన్నవాళ్లు కూడా బెల్టు షాపుల దెబ్బకు మళ్లీ మత్తులో మునిగితేలుతున్నారని వాపోతున్నారు.

మంత్రి ఇలాకాలోనూ..

అనుమసముద్రంపేట : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇలాకాలోనూ బెల్టుషాపులు జోరుగా వెలుస్తున్నాయి. మద్యం దుకాణాలను వేలంలో దక్కించుకున్న వారు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలను ప్రారంభించి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. ఏఎస్‌పేట మండలంలోని ఏఎస్‌పేట, హసనాపురం గ్రామాల్లో ఉదయం ఆరు గంటల నుంచే బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాల్సి ఉండగా రూ.30 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. బెల్టుషాపులను నియంత్రించాల్సిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.